బాధ్యతగా పనిచేయాలి

రవినాయక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 2 : మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా 16నెలలు పనిచేసి బదిలీపై కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా వెళ్లిన రవినాయక్‌ను జిల్లా అధికారులు, ఉద్యోగులు మంగళవారం పాలమూరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడానికి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో పనిచేసిన అనతి కాలంలోనే అందరు అధికారులు, ఉద్యోగుల అభిమానాన్ని రవినాయక్ చూరగొన్నారని తెలిపారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

ఆదర్శ పాఠశాల ఎదుట ధర్నా ,చేస్తున్న విద్యార్థులు

ధన్వాడ, జూలై 2 : మండలకేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేర్ టేకర్, ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా తరగతి గదుల్లో గోడలకు షాక్ వస్తుందని, మాడిపోయిన అన్నం వడ్డిస్తున్నారని, హాస్టల్‌లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఆరోపించారు. విషయం తెలుసుకున్న జీసీడీవో పద్మానళిని పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. వారంరోజుల్లో ఏఎన్ఎంను నియమిస్తామని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ కోసం రభస



గొడవ పడుతున్న మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు

మహ్మదాబాద్, జూలై 2 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏ జెన్సీ తమకంటే తమకే కావాలని ఇరువురు పోటీపడి గొడవకు దిగిన ఘటన చోటు చేసుకున్నది. మధ్యాహ్న భోజన ఏజెన్సీ జూన్ 30వ తేదీ వరకు ముగిసిపోవడంతో కొత్త వారి కోసం మహిళ సంఘం సభ్యురాలికి హెచ్ఎం, విద్యా కమిటీ చైర్మన్, ఏపీఎం కలిసి తీర్మానం చేశారు. మంగళవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండడానికి నూతన ఏజెన్సీ వారు వంట పాత్రలు, సరుకులు తీసుకొని రాగా, గ్రామంలోని మరికొందరు మహిళా సంఘాల వారు మాకు కూడా అవకాశం ఇవ్వాలని గొడవకు దిగారు. గొడవ కాస్త పెద్దది కావడంతో పోలీసులు వచ్చి ఇరువురికి సర్ది చెప్పారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు మీరే నిర్ణయించకొని రావాలని వారికి సూచించారు. కూలీలతో వంటలు చేయించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల మంత్రి సీతక్క
- మహిళా సంఘాలకు రూ.50 కోట్ల రుణాలు పంపిణీ
- అచ్చంపేట నియోజకవర్గంలో పర్యటించిన మంత్రులు, ఎమ్మెల్యే

అచ్చంపేటలో మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



అమ్రాబాద్ : విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న మంత్రి సీతక్క

అచ్చంపేట, జూలై 2 : రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల మంత్రి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేశారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి అమ్రాబాద్, పదర, అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల మండలాల్లో పర్యటించారు. సాయంత్రం అచ్చంపేటలోని ఏసీఆర్ గార్డెన్‌లో మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఒక నూతన ఉత్సహాన్ని, ఉత్తేజాన్ని, ఉపాధిని ఆర్థిక ప్రగతిని ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలతో ముందుకెళ్తుందన్నారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మహిళాశక్తి కార్యక్రమాల్లో భాగంగా ఆధార్ కేంద్రాలు, మీసేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ పామ్స్, క్యాంటిన్లు ఇతర వ్యాపారాలు ఏర్పాటు చేయించి ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలు అందిస్తామన్నారు. మహిళా శక్తి క్యాంటిన్లు పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల వెంట ఏర్పాటు చేసి స్వచ్ఛమైన పల్లెరుచులను రుచి చూపించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలో 514 మహిళా సంఘాలకు రూ.50 కోట్ల 10లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు 1992లో మహిళల అభ్యున్నతికి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని అన్నారు. మహిళలు ఆర్థికంగా, ఆత్మగౌరవంతో జీవించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీడీ డీఆర్డీవో చిన్న ఓబులేసు, జెడ్పీటీసీ అనురాధతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం..

ఉప్పునుంతల, జూలై 2 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. సాయంత్రం ఉప్పునుంతల మండలంలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. జీన్‌కుంట స్టేజి నుంచి మామిళ్లపల్లి, దాసర్లపల్లి మీదుగా రామగిరి వరకు రూ.3.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.2.97కోట్ల నిధులతో ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.49లక్షలతో నిర్మించిన సింగిల్‌విండో గోదాంను ప్రారంభించారు. మామిళ్లపల్లిలో రూ.20లక్షలతో కల్యాణ మండప నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ అరుణానర్సింహారెడ్డి, అనంతారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, చిన్నజంగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రాసేనారెడ్డి, లక్ష్మీనారాయణ, జగత్‌రెడ్డి, నారంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ రామ్మోహన్‌రావు, డీఈ చంద్రకళ, ఏఈ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యం

అమ్రాబాద్/బల్మూర్, జూలై 2 : విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి గ్రామంలో రూ.3.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కేజీబీవీని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆమె ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని మన్ననూర్, అమ్రాబాద్, రాయలగండి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మన్ననూర్‌లో చెంచులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి శారద, జెడ్పీటీసీ అనురాధ, డీఈవో గోవిందరాజులు, సీడీపీవో దమయంతి తదితరులు పాల్గొన్నా రు. బల్మూర్ మండలంలోని జినుకుంట గేట్ దగర బీటీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీలు లక్ష్మి, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ఈదురు గాలులకు కూలిన గుడిసె

ఎల్కూర్‌లో రేకుల గుడిసెపై కూలిన చెట్టు

మల్దకల్, జూలై 2 : ఎల్కూర్ గ్రామంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో యేసు గుడిసె ముందున్న చెట్టు ఈదురు గాలులకు కూలిపోయింది. ఆ చెట్టు రేకులగుడిసెపై పడడంతో యేసుతోపాటు భార్యాపిల్లలు హుటాహుటినా బయటకు పరుగులు తీయగా గుడిసె కూడా కూలిపోయింది. గుడిసె కూలిపోవడంతో వీరి కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తిపై బీరుసీసాలతో దాడి

- కేసు నమోదు

వంగూరు, జూలై 2 : పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని తిరుమలగిరి సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండలంలోని సర్వారెడ్డిపల్లికి చెందిన శేఖర్ మంగళవారం నల్లగొండ జిల్లాలోని డిండికి బైక్‌పై వెళ్లాడు. స్వగ్రామానికి రాత్రి బయలుదేరగా అదే గ్రామానికి చెందిన రాజుతోపాటు పలువురు బీరు సీసాలతో దాడి చేశారు. దీంతో శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్టు

- మంత్రి సీతక్క పర్యటనను అడ్డుకుంటారని పీఎస్‌కు తరలింపు

అచ్చంపేట రూరల్, జూలై 2 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో మంగళవారం గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పర్యటించారు. ఆయా మండలాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలకు మంత్రి సీతక్క రాగా.. పర్యటనను అడ్డుకుంటారన్న అనుమానంతో బీఆర్ఎస్ రాష్ట్ర, విద్యార్థి, యువజన విభాగం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి అచ్చంపేట ఠాణాకు తరలించారు. అయితే, ప్రభుత్వం భయపడి తమ ఇండ్లలో చొరబడి అరెస్ట్ చేయడం శోచనీయమని బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొర్ర వంశీనాయక్ ఆరోపించారు. ప్రభుత్వం గిరిజనులపై వివక్షత చూపి తమ హక్కులను హరిస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అక్రమ అరెస్టులకు పాల్పడి గిరిజనులపై ప్రభుత్వం కపట ప్రేమను చూపుతుందన్నారు. ప్రశ్నించే గిరిజనుల నోరు నొక్కడంతో సాధించేదేమీ లేదని.. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు దుబ్బతండా ముడావత్ శివ, రమేశ్, రంగాపూర్ రవీందర్, రవి ఉన్నారు.

అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ యువజన నాయకులతో పోలీసులు

వనమహోత్సవం బజారు పాలు

పొన్నకల్ రోడ్డు పక్కన నాటకుండా వదిలేసిన మొక్కలు

మూసాపేట(అడ్డాకుల), జూలై 2 : ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం గా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం బజారున పడింది. గత కేసీఆర్ ప్రభుత్వం పాలన లో హరితహారం పేరుతో ప్రా రంభమైన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకం గా ప్రారంభించి నిర్వహించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటుతూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరుతో ప్రారంభించారు. కానీ అడ్డాకుల మండలంలోని జాతీయ రహదారి నుంచి పొన్నకల్ గ్రామనికి వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు తెచ్చారు. తీసుకొచ్చిన మొక్కలను నాటకుండా రోడ్డు పక్కన పడేశారు. కవర్లు కూడా తీయకుండా వదిలేయడంతో అక్కడే మొక్కలు ఎండిపోతున్నాయి. అటు వైపు వెళ్తున్న వృక్ష ప్రేమికులు మొక్కలు నాటేందుకు పట్టింపు లేకుండా పోయింద ని వాపోతున్నారు. ఆ మొక్కలు పెంచడం కోసం విత్తనం నుంచి మొదలుకొని మట్టిని ఎరువుగా మార్చి మొక్కను పెంచడం కోసం ప్రభుత్వం ప్రజాధనం ఖర్చు చేస్తుంది. వాటిని నాటి సంరక్షిస్తే వృక్షాలుగా మారి కా లుష్యాన్ని తగ్గిస్తుంది. అంతేకాక ప్రజలకు మంచి ఆక్సిజన్ అందించాలనే ప్రభుత్వ ల క్ష్యం నేరవేరుతుం ది. కానీ కొంతమంది ని ర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టింపు లేకుండా ఉండడంతో ఇలాంటి ఘ టనలో ప్రతి రోజూ ఏదో ఒక గ్రామంలో చో టుచేసుకుంటున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందిస్తూ పెంచిన ప్రతి మొక్కను నాటిస్తే ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు.

తుంగభద్ర డ్యాంకు వరద

అయిజ, జూలై 2 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో కురుస్తున్న వానలకు తుంగ జలాశయం నుంచి దిగువన ఉన్న తుంగభద్ర డ్యాంకు వరద చేరుతున్నది. మంగళవారం డ్యాంలోకి 11,595 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 297 క్యూసెక్కులు నమోదైంది. తుంగభద్ర డ్యాం 105.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 7.909 టీఎంసీల నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1585.87 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

అదానీ-హిండెన్‌బర్గ్ మధ్యలో కొటక్!

హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు

- అదానీ స్టాక్స్‌కు సంబంధించిన పెట్టుబడుల్లో నిబంధనల ఉల్లంఘన పేరిట సమన్లు జారీ
- కొటక్ బ్యాంక్‌ను పూర్తిగా రాయక పోవడంపై హిండెన్‌బర్గ్ ప్రశ్న
- మరో వ్యాపారవేత్తను రక్షించే చర్యలంటూ మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): అమెరికా షార్ట్ సెల్లింగ్ రిసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్, అదానీ గ్రూప్‌ల మధ్య ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అదానీ వివాదానికి సంబంధించి ఇండియా మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హిండెన్‌బర్గ్‌కు గత నెల 27న 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల్లో తాము నిబంధనల్ని ఉల్లంఘించినట్లు సెబీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపింది. అయితే, ఈ వివాదంలో కొటక్ బ్యాంక్ ప్రస్తావనను హిండెన్‌బర్గ్ ఉటంకించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగింది?

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కిందటేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ బాంబు పేల్చింది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. ఈ వివాదంపై దర్యాప్తు చేపడుతున్న సెబీ సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తాజాగా హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల ద్వారా ఆ కంపెనీ 22.25 మిలియన్ డాలర్ల లాభాలు పొందిందన్నది.

అర్థంలేని నోటీసులు: హిండెన్‌బర్గ్

సెబీ షోకాజ్ నోటీసులను హిండెన్‌బర్గ్ 'అర్థంపర్థం లేనివి'గా కొట్టిపారేసింది. ఉద్దేశపూర్వకంగానే సెబీ ఆ నోటీసులను జారీ చేసిందని మండిపడింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపే వారిని సెబీ బెదిరింపులకు గురిచేస్తుందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని స్పష్టం చేసింది. చిన్న మదుపర్లను రక్షించాల్సిన సెబీ అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నదని తీవ్రంగా ధ్వజమెత్తింది.

సెబీ పేర్కొన్న లాభాలేమీ రాలే..

సెబీ ఆరోపించినట్టు అదానీ కంపెనీల షార్ట్ సెల్లింగ్ ప్రక్రియలో తమకు భారీ లాభాలేమీ రాలేదని హిండెన్‌బర్గ్ ఈ సందర్భంగా వెల్లడించింది. అదానీ షేర్ల షార్టింగ్ ద్వారా 4.1 మిలియన్ డాలర్ల స్థూల ఆదాయం పొందినట్టు, అదానీ అమెరికా బాండ్ల షార్ట్ ద్వారా మరో 31 వేల డాలర్లు లభించినట్లు వెల్లడించింది. ఖర్చులు పోను ఏమీ మిగల్లేదన్నది.

ఆరోపణలు అవాస్తవం: కొటక్

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కొటక్ బ్యాంక్ స్పందించింది. ఈ వ్యవహారంతో అసలు సంబంధం లేదని వెల్లడించింది. బ్యాంక్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ కింగ్డన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు హిండెన్‌బర్గ్ అసలు క్లయింటే కాదని పేర్కొంది. తమ ఫండ్‌లో హిండెన్‌బర్గ్ అసలు ఇన్వెస్టర్ కూడా కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ సంస్థ షేర్లు 4 శాతం నష్టపోయాయి.

'కొటక్' పేరు రాయరెందుకు?

సెబీ నోటీసులపై హిండెన్‌బర్గ్ స్పందిస్తూ 'కొటక్ బ్యాంక్' పేరును ప్రస్తావించడం ఇప్పుడు సంచలనంగా మారింది. బిలియనీర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని కొటక్ బ్యాంక్ విదేశీగడ్డపై ఓ ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు ఈ సందర్భంగా హిండెన్‌బర్గ్ వెల్లడించింది. దాన్ని ఉపయోగించుకొని కింగ్డన్ క్యాపిటల్ అనే పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను తాము షార్ట్ చేసినట్లు పేర్కొంది. ఇందులో కొటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్), కేఐవోఎఫ్ సహకారం ఉన్నట్టు తెలిపింది. అయితే, సెబీ తమకు ఇచ్చిన నోటీసుల్లో ఎక్కడా కొటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన గానీ ప్రస్తావించలేదని మండిపడింది. కేఎంఐఎల్ అంటూ పొడి అక్షరాలను వాడుతూ, కే-ఇండియా అపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ అంటూ కొటక్ పేరు బయటకు రాకుండా సెబీ జాగ్రత్తలు తీసుకొన్నట్టు విరుచుకుపడింది.

ఫార్మా సదస్సుకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారథి రెడ్డి, ఇండస్ట్రీ వర్గాలు

హైటెక్స్‌లో 5న భారతీయ ఔషధ సదస్సు

హైదరాబాద్, జూలై 2: ఈ ఏడాదికిగాను 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద జరుగనున్నది. ఈ నెల 5-7 తేదీల్లో మూడు రోజులపాటు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఈ సదస్సును నిర్వహించనున్నది. 'ప్రపంచ శ్రేయస్సు కోసం భారతీయ ఔషధ రంగ పాత్ర' అనే థీమ్‌తో ఈసారి సమావేశాలు జరుగుతున్నాయి. దాదాపు 9,000 మంది నిపుణులు, పరిశోధకులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆహ్వానించింది.

సీఎంతో నోకియా బృందం భేటీ..

నోకియా కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. వీరిలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాక్స్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ భేటీ అయ్యారు.

వాణిజ్య

వెస్పా స్కూటర్ ధర

14.28 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ మార్కెట్లోకి నయా వెస్పా అందుబాటులోకి వచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదలైన ఈ వెస్పా 946 డ్రాగన్ స్కూటర్ 155 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది. కేవలం అంతర్జాతీయంగా 1,888 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్న ఈ మాడల్ ధర రూ.14,27,999(ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి)గా నిర్ణయించింది. భారత్‌లో ఎన్ని యూనిట్లు విక్రయిస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా సంస్థ. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 200 ఎంఎం డిస్క్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో రూపొందించిన ఈ స్కూటర్ యువతకు నచ్చుతుందని పేర్కొంది.

ఐసీఐసీఐ సఫిరో ఫారెక్స్ కార్డ్

విదేశీ విద్యార్థుల కోసం తెచ్చిన బ్యాంక్



న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్.. మంగళవారం ఓ ప్రీ-పెయిడ్ ఫారెక్స్ కార్డును పరిచయం చేసింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల కోసం 'సఫిరో' సిరీస్‌లో ఈ కార్డును బ్యాంక్ తీసుకొచ్చింది. చదువు సంబంధిత ఖర్చులను అధిగమించడానికి అటు విద్యార్థులతోపాటు ఇటు తల్లిదండ్రులకూ తమ ఈ కార్డు ఎంతో సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. అడ్మిషన్ ఫీజులు, కోర్సు సంబంధిత చెల్లింపులతోపాటు ప్రయాణం, భోజనం, కిరాణా ఇతర రోజువారీ ఖర్చులకు సఫిరో ఫారెక్స్ కార్డు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో బ్యాంక్ వివరించింది.

- ఈ కార్డు వినియోగదారులు 15 దేశాల కరెన్సీల్లో లావాదేవీలను ఎలాంటి చార్జీలు లేకుండానే చేసుకోవచ్చు.
- కేవలం ఒక్క కరెన్సీకి చెందిన నగదే ఉన్నా.. విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.
- కస్టమర్లకు ఒక ప్రైమరీ కార్డుతోపాటు ఓ రీప్లేస్‌మెంట్ కార్డును ఐసీఐసీఐ ఇస్తుంది.
- ప్రైమరీ కార్డు పోయినప్పుడు/పాడైపోయినప్పుడు ఐమొబైల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం ద్వారానైనా రీప్లేస్‌మెంట్ కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు.

మాల్యాకు ఎన్బీడబ్ల్యూ

ముంబై, జూలై 2: పరారీ వ్యాపారవేత్త విజయ్ మాల్యాపై తాజాగా మరో నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) జారీ అయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ)కు రూ.180 కోట్ల రుణం ఎగవేశారన్న కేసులో ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎస్పీ నాయక్ నింబాల్కర్ ఎన్బీడబ్ల్యూకు ఆదేశించారు. 2007 నుంచి 2012 మధ్య మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ఈ రుణాలను తీసుకున్నది.

సింగరేణి లక్ష్యం 2 లక్షల టన్నుల ఉత్పత్తి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు రోజుకు 2లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (మట్టి)ని తొలగించాలన్నారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో కలిసి బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ వంటి అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

హైదరాబాద్‌లో ఫినోమ్

హైదరాబాద్, జూలై 2: మానవ వనరుల సేవలు అందించే ఫినోమ్.. అమెరికా కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న టైడీని హస్తగతం చేసుకున్నది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ మాట్లాడుతూ.. మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండేండ్లకాలంలో మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో రెండు, వైజాగ్‌లో ఒక కార్యాలయం ఉండగా, వీటిలో 950 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

టారిఫ్‌లు పెంచినా జియో ప్లాన్లే చౌక

హైదరాబాద్, జూలై 2: దేశీయ టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రీచార్జి ప్లాన్ల ధరలను పెంచుతూ టెలికం కస్టమర్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే. గతవారంలో జియో తన ప్లాన్ల ధరలను 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా ప్లాన్ల ధరలను 25 శాతం వరకు సవరించాయి. అయితే చార్జీలు పెంచిన తర్వాత జియో ప్లాన్లే చౌక ధరకు లభిస్తుండటం విశేషం. ఉదాహరణకు రోజుకు 1 జీబీ డాటా, అన్‌లిమిటెడ్ ప్లాన్ ధర రూ.249 కాగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.299కి అందిస్తున్నాయి. అంటే 20 శాతం తక్కువ ధరకే లభిస్తుండటంతో రూ.50 ఆదా కానున్నది. అలాగే రోజుకు 2 జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్ జియో రూ.249కి అందిస్తుండగా, ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.379గా ఉన్నది. జియో కస్టమర్లు 9 శాతం తక్కువ ధరకే ఈ ప్లాన్ లభిస్తుండటం విశేషం. మరోవైపు, మూడు నెలల ప్లాన్ విషయానికి వస్తే 6జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్‌ను జియో రూ.479కి అందిస్తుండగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు ఆరు శాతం అధికంగా రూ.509కి అందిస్తున్నాయి. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ జియో ధర రూ.799 ఉండగా, అదే పోటీ సంస్థలైన ప్లాన్లు 8 శాతం ఎక్కువగా రూ.859కి అందిస్తున్నాయి.

ఫార్మాకు భూముల కొరత!

- ప్రకటించిన మూడు జిల్లాల్లోనూ అడ్డంకులే
- కొత్తగా రెండు ప్రాంతాలు ఎంపిక చేసిన ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఫార్మా విలేజ్‌లు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతుండగా.. తాజాగా భూముల కొరత వెంటాడుతున్నది. నల్గొండ, మెదక్, వికారాబాద్ తదిరత మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా..ఈ మూడు చోట్ల భూముల లభించే పరిస్థితి లేదని ఆయా జిల్లా కలెక్టర్లు తేల్చిచెప్పారు. అయితే జహీరాబాద్‌లో భూసేకరణ అవకాశం ఉండగా, వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని సర్కార్ యోచిస్తున్నది. దీంతో మొదటిదశలో ఈ రెండు ప్రాంతాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారుగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఫిబ్రవరిలో జరిగిన బయో ఏషియా సదస్సులో ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాలో 1000 నుంచి 2 వేల ఎకరాల స్థలంలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫార్మా పరిశ్రమలు కాలుష్యంతో కూడిన రెడ్ జోన్ పరిధిలోకి వస్తాయి కాబట్టి, వీటి ఏర్పాటునకు స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు కూడా ఉండటంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది.

ఎకోసిస్టం లేకుండా సాధ్యమేనా..

పరిశ్రమల ఏర్పాటునకు సంబంధించి పర్యావరణ వ్యవస్థ(ఎకోసిస్టం) అభివృద్ధి కావడం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు రాష్ట్రంలో అనేక దిగ్గజ ఐటీ కంపెనీలు ఉన్నాయి. దీంతో వాటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో చిన్నాచితకా ఐటీ కంపెనీలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి పర్యావరణ వ్యవస్థ లేకుండా పరిశ్రమల మనుగడ సాధ్యంకాదు. ఫార్మా రంగం విషయానికొస్తే, ఇప్పటికే జీడిమెట్ల, బాలానగర్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమలు కొలువుదీరాయి. జీనోమ్ వ్యాలీలో అనేక కంపెనీలు తమ పరిశోధన కేంద్రాలను నెలకొల్పాయి.